సాక్షి
విజయనగరం
మంగళవారం । 3 । జనవరి । 2023



'ముక్కోటి' పూజలు..

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఎ.సూర్యకుమారి విశాఖపట్నంలోని సింహాచలం క్షేత్రాన్ని సోమవారం దర్శించారు. ఉత్తర ద్వారం గుండా శ్రీవర హాలక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్నారు.



వేర్వేరు ప్రమాదాల్లో...

జిల్లాలోని వేర్వేరు చోట్ల సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతిచెందారు. మరి కొందరు గాయపడ్డారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఆయా కుటుంబాల్లో విషాదం అలముకుంది. - 8లో



ఘనంగా పెదపోలమాంబ తొలేళ్ల ఉత్సవం

శంబర పెదపోలమాంబ తొలేళ్ల ఉత్సవం వైభవంగా సాగింది. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. పసుపు కుంకుమలు సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. - 8లో

న్యూస్‌రీల్

చిరుధాన్యాల సాగు లాభదాయకం

- కలెక్టర్ సూర్యకుమారి



చిరుధాన్యాల ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం ఫోర్ట్: చిరుధాన్యాల సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చని కలెక్టర్ సూర్యకుమారి పేర్కొన్నారు. స్పందన కార్యక్రమం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన చిరుధాన్యాలు, కూరగాయల ప్రదర్శన స్టాల్స్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని, సేంద్రియ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని చెప్పారు. అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం ఆర్జించవచ్చన్నారు. ప్రదర్శనలో బెల్లం, పసుపు, బ్రౌన్ రైస్‌తో పాటు సన్నబియ్యం, కొర్రలు, సామలు, ఉలవలు, చోడి తదితర చిరుధాన్యాలను ప్రదర్శించారు. గంట సమయంలో సుమారు రూ.17వేలు విలువైన ఉత్పత్తుల విక్రయం జరిగింది.

నవోదయ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలయినట్టు ప్రిన్సిపాల్ వి.దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు. జిల్లాలో నివసిస్తూ 2022-23 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 29వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు www.navodaya.gov.i n వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

చిన్నారుల ఔదార్యం



నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నెల్లిమర్ల: మండలంలోని సతివాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. అదే పాఠశాలలో చదువుతూ అనారోగ్యంతో బాధపడుతున్న లెంక హరినాయుడు అనే విద్యార్థి వైద్యసేవల కోసం రూ.35వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ చేతులమీదుగా విద్యార్థి తల్లిదండ్రులకు సోమవారం అందజేశారు.

నేడు మంత్రి బొత్స జిల్లా పర్యటన

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయనగరం జిల్లాలో మంగళవారం పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు విజయవాడ నుంచి తన నివాసానికి చేరుకుంటారు. 11 గంటలకు గంట్యాడ మండలం కొటారుబిల్లి కూడలిలో నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. 4 గంటలకు కలెక్టరేట్ వద్ద సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 4:30 గంటలకు విశాఖపట్నం బయలుదేరి వెళ్తారు.

16 నుంచి ఫేస్ రికగ్నైజ్ యాప్‌లో హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న ఏబీసీడబ్ల్యూఓ రమణ

విజయనగరం పూల్‌బాగ్: ఉద్యోగులందరూ ఈ నెల 16 నుంచి ఫేస్ రికగ్నైజ్ యాప్‌లో హాజరు నమోదు చేయాలని విజయనగరం అర్బన్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బీవీ రమణ సూచించారు. తన కార్యాలయంలో వార్డెన్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. చదువుకునే వాతావరణం కల్పించాలన్నారు. సమావేశంలో వార్డెన్లు ఎ.సురేష్, జానకీరావు, ఎ.అప్పన్న, మేరీ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు... 8,999

నాడు అసంబద్ధ హామీలు, అధికారంలోకి వచ్చాక మ్యానిఫెస్టోను అటకెక్కించేయడం, ఉన్న పింఛన్లలో కోత వేసేయడం, పింఛన్ల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయించడం... గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన చోద్యం!.

నేడు మాట ఇస్తే అమలు చేయాల్సిందే. కరోనా మహమ్మారి విసిరిన పంజాతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైనా పింఛనుదారులకు ఏనాడూ కష్టం రాకుండా చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సఫలమయ్యారు. తాను ఇచ్చిన హామీ ప్రకారం అవ్వాతాతల పింఛను రూ.2,750కు పెంచారు. ఆ మొత్తాన్ని ఠంచన్‌గా ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు అందిస్తుంటే వారి ముఖాల్లో చిరు దరహాసం కనిపిస్తోంది.

- జిల్లాలో 2.83 లక్షలకు చేరిన వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ప్రకారం రూ.2,750కు పెంపు
- తొలి రెండు రోజుల్లో సగానికి పైగా లబ్ధిదారుల చేతికి పింఛన్
- ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్న వలంటీర్లు
- నేటి నుంచి పింఛన్ల వారోత్సవాలు
- రాజమండ్రిలో లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- జిల్లాలో కొటారుబిల్లి వేదికగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి బొత్స సత్యనారాయణ



విజయనగరంలోని కొత్తపేటలో మంచంపై లేవలేని స్థితిలో ఉన్న ప్రమీలకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సంతోషి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

వైఎస్సార్ పింఛను కానుక రూ.2,750 కు పెంపుదల చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ పెంపుదలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రాజమండ్రిలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. జిల్లాలో గంట్యాడ మండలం కొటారుబిల్లి గ్రామ వేదికగా ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య మంత్రిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి వెల్లడించారు. వాస్తవానికి పెరిగిన పింఛన్లను ఈనెల 1వ తేదీ ఆదివారం సెలవు దినం అయినప్పటికీ వలంటీర్లు లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. సోమవారానికి సగానికి పైగా లబ్ధిదారుల చేతికి పింఛను అందించగలిగారు. మరోవైపు జిల్లాలో కొత్తగా 8,999 పింఛన్లు మంజూరయ్యాయి. వీటి పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మెరకముడిదాంలో మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ చేతుల మీదుగా ఆయా లబ్ధిదారులకు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.

పాదయాత్రలో ఇచ్చిన హామీ...

పింఛన్ నాలుగు దఫాల్లో పెంపు చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ మేరకు అవ్వాతాతలకు పింఛన్ రూ.2,750కి పెరిగింది. అంతేకాదు అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంతృప్తికర స్థాయిలో మంజూరుచేస్తామని హామీ ఇచ్చారు. అలా కొత్త పింఛన్లు కూడా 8,999 మంజూరయ్యాయి. దీంతో జిల్లాలో మొత్తం పింఛన్‌దారుల సంఖ్య 2,83,098కి చేరింది. కొత్త పింఛన్‌దారుల్లో 3,586 మంది వితంతువులు ఉన్నారు. అవ్వాతాతలు 3,438 మంది, విభిన్న ప్రతిభావంతులు 1,242 మంది ఉన్నారు. డప్పు కళాకారులు 255 మంది, కల్లుగీత కార్మికులు 198, చర్మకారులు 117, మత్స్యకారులు 102 మంది ఉన్నారు. 48 మంది ఒంటరి మహిళలు, 12 మంది నేత కార్మికులతో పాటు హిజ్రా ఒకరికి కొత్తగా పింఛన్ మంజూరైంది.

నియోజకవర్గం వారీగా పింఛన్ల వివరాలు...

నియోజకవర్గం	కొత్త పింఛన్లు	మొత్తం పింఛన్లు
బొబ్బిలి	1,390	43,792
చీపురుపల్లి	1,251	38,756
గజపతినగరం	1,394	41,434
నెల్లిమర్ల	1,288	39,461
రాజాం	962	40,201
శృంగవరపుకోట	1,209	42,255
సాలూరు (మెంటాడ)	224	7,777
విజయనగరం	1,281	29,422
మొత్తం	8,999	2,83,098

ఉచితంగా బియ్యం

- ఒక్క రూపాయి కూడా చెల్లించక్కర్లేదు
- జిల్లాలో ముమ్మరంగా ధాన్యం కొనుగోలు
- రైతులకు ఇప్పటివరకూ రూ.110 కోట్లు చెల్లింపు
- రెండు మూడు రోజుల్లో మరో రూ.1.10 కోట్ల వరకూ జమ
- త్వరలో సూపర్‌ఫైన్ రకం ధాన్యం కొనుగోలు
- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



సాక్షి ప్రతినిధి, విజయనగరం: రేషన్‌కార్డుదారులకు ఈనెల నుంచి బియ్యం పూర్తి ఉచితం. రూపాయి కూడా ఎవ్వరికీ చెల్లించనక్కర్లేదు. మరోవైపు సంక్రాంతిలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలనేది లక్ష్యం. ఆయా రైతులకు పది రోజుల్లో గడువులోనే చెల్లింపులు జరుగుతున్నాయి. ఇప్పటివరకూ రూ.110 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యింది. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న ఉచిత బియ్యం పంపిణీ, ధాన్యం కొనుగోలు ప్రక్రియలపై పలు విషయాలను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం సాయంత్రం మీడియా సమావేశంలో వెల్లడించారు.

మామూళ్లు తీసుకుంటే చర్యలు...

రేషన్ కార్డులపై ఇప్పటివరకు కిలో రూపాయి చొప్పున అందిస్తున్న ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం ఇకపై పూర్తిగా ఉచితం. జనవరి నుంచి లబ్ధిదారులకు ఉచితంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు జిల్లాలో ఉచిత బియ్యం పంపిణీ ప్రారంభమైందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ చెప్పారు. ఎప్పటిలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న 370 ఎండీయూ వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే తీసుకెళ్లి బియ్యం పంపిణీ జరుగుతుందని వెల్లడించారు. బియ్యం తీసుకునే లబ్ధిదారులు ఎండీయూ వాహనదారుడికి పండగ మామూళ్లు గానీ, ఇతరత్రా కూడా డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. ఒకవేళ ఎవరైనా వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, రేషన్ బియ్యాన్ని ఎవరికైనా విక్రయించినా, పక్కదారి పట్టించినా చట్టప్రకారం నేరమని, అందుకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బియ్యం సరఫరాకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే కాల్ సెంటర్ 1967, టోల్‌ఫ్రీ నెంబర్ 18004250082 నంబర్లకు ఫోన్ చేయవచ్చని సూచించారు.

సంక్రాంతికి పంచదార, కందిపప్పు...

సంక్రాంతి పండగను దృష్టిలో ఉంచుకొని ఈనెల అరకిలో పంచదార రూ.17కు, కిలో కందిపప్పు రూ.67కు కార్డుదారులందరికీ సరఫరా చేస్తామని జేసీ చెప్పారు. జిల్లాలో 5,71,000 బియ్యం కార్డులు ఉన్నాయన్నారు. ఇంకా అర్హులైన వారు ఉంటే కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జిల్లాలో కొత్తగా 2700 బియ్యం కార్డులు మంజూరయ్యాయని చెప్పారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోలు...

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని, సంక్రాంతి పండుగలోగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని జేసీ మయూర్ అశోక్ చెప్పారు. ఇప్పటికే 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. గత ఏడాది ఇదే సమయానికి కేవలం 10 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు జరిగిందని గుర్తు చేశారు. ఈసారి ఖరీఫ్‌లో ధాన్యం దిగుబడి బాగుందన్నారు. సీఎంఆర్ కూడా సుమారు 20 వేల మెట్రిక్ టన్నుల వరకూ పూర్తయ్యిందని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతులకు దాదాపు రూ.110 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. వాస్తవానికి 21 రోజుల వరకూ గడువు ఉన్నా ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత 10 నుంచి 15 రోజుల్లోనే చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. మరో రెండు మూడు రోజుల్లో రూ.1.10 కోట్ల వరకూ చెల్లింపులు ఉంటాయని వెల్లడించారు. రైతులు సొంతంగా రవాణా వాహనాలను సమకూర్చుకున్నా, గోనె సంచులు కొనుగోలు చేసుకున్నా ఆ డబ్బులు కూడా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. ఇలా ఇప్పటివరకు సుమారు రూ.20 లక్షలను జమ చేశామన్నారు. ధాన్యం అన్‌లోడింగ్ చార్జీలు కూడా రవాణా చార్జీల్లోనే కలిపి ఉంటాయని చెప్పారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఆ కమిటీలతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరిస్తున్నామని చెప్పారు.

ఫిర్యాదు చేయండి

బియ్యం పంపిణీలో ఇబ్బందులపై ఫిర్యాదు చేయడానికి...

కాల్ సెంటర్: 1967

టోల్ ఫ్రీ నంబరు: 18004250082

తూకం తేడా చేస్తే కఠిన చర్యలు

ఇటీవల వర్షాలతో ఒకటీ రెండు మండలాల్లో ధాన్యం రంగుమారాయని, వీటిని కూడా కొనుగోలు చేస్తామని జేసీ స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందవద్దన్నారు. సూపర్ ఫైన్ రకం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. మిల్లు వద్ద సమస్య రాకుండా కస్టోడియన్ అధికారులను నియమించామన్నారు. తూకంలో నిర్ణీత బరువు కన్నా ధాన్యం ఒక్క కిలో కూడా అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదని ప్రస్తావించారు. అలా ఎవరైనా అదనంగా తూకం వేస్తామని తేడా చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుగా రైతుభరోసా కేంద్రాల ద్వారానే తూకం వేసి, ట్రక్ షీట్‌లను జనరేట్ చేస్తున్నారని చెప్పారు. అందువల్ల అదనంగా ధాన్యాన్ని తీసుకునే అవకాశం కూడా లేదన్నారు. రైతులు ఆర్‌బీకేల్లో సిబ్బందిని సంప్రదించాలని, వారి సూచనలకు అనుగుణంగా తమ వద్ద నున్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని జేసీ అశోక్ కోరారు.

'ఆల్టర్ ఈగో' పుస్తకావిష్కరణ

విజయనగరం టౌన్: చాసో వర్ధంతిని పురస్కరించుకుని గురజాడ గృహంలో సోమవారం రాత్రి సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో 'బహుశా' వేణుగోపాల్ కథాసంపుటి 'ఆల్టర్‌ఈగో' పుస్తకాన్ని ఆవిష్కరించారు. చాసో స్మారకోపన్యాసాన్ని మల్లాప్రగడ రామారావు అందించారు. కార్యక్రమానికి జీవీ శ్రీనివాసరావు ఆహ్వానం పలికారు. రచయిత్రి ఇనుగంటి జానకి పుస్తకావిష్కరణ చేశారు. పాయల మురళీ కృష్ణ నిర్వహణలో జరిగిన కార్యక్రమానికి కొత్తూరి శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

సర్వపాప హరణం.. ఉత్తరద్వార దర్శనం



ప్రత్యేక అలంకరణలో సీతారామ లక్ష్మణుల విగ్రహాలు

- ఊరూరా ముక్కోటి ఏకాదశి పూజలు
- రాములోరి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- రామనామస్మరణతో మార్మోగిన రామతీర్థం పుణ్యక్షేత్రం
- గిరి ప్రదక్షిణలో పాల్గొన్న వేలాదిమంది భక్తులు



మహిళల కోలాట ప్రదర్శన



ఆలయ ప్రాంతంలో దీపారాధన



వైకుంఠ ద్వార దర్శనానికి బారులు తీరిన భక్తులు



సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలతో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తజనం

నెల్లిమర్ల:

ముక్కోటి ఏకాదశి పర్వదినాన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం భక్తసంద్రంగా మారింది. రామనామస్మరణతో మారుమోగింది. శ్రీమహా విష్ణువు అవతారాల్లో ఒకరైన శ్రీరామచంద్ర ప్రభువును భక్తులు ఉత్తరద్వారంలో దర్శించి పులకించిపోయారు. దేవస్థానం అధికారులు నిర్వహించిన గిరి ప్రదక్షిణలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. రాములోరిని స్మరిస్తూ నీలాచలం చుట్టూ ప్రదక్షిణ చేశారు. కొండపైకి వెళ్లే ప్రారంభంలో నిర్వహించిన మెట్లోత్సవం, గోపూజ కార్యక్రమాల్లో పాల్గొని తరించారు. ఏకాదశి పర్వదినాన ఆలయంలోని లక్ష్మీదేవి సన్నిధిలో సీతారాముల కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు.

వేకువజామున 5 గంటలకు ప్రారంభమైన దర్శనాలు

ఆలయంలోని సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులకు ప్రాతఃకాల అర్చనలు జరిపిన తరువాత భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ఉదయం 8 గంటల తర్వాత ఉత్సవమూర్తులను రామతీర్థం తిరువీధిలో మేళతాళాలతో ఊరేగించారు.

భక్తిశ్రద్ధలతో మెట్లోత్సవం, గోపూజ

తిరువీధి అనంతరం సీతారామలక్ష్మణుల విగ్రహాలను నీలాచలం మెట్ల మార్గం వద్దకు తీసుకెళ్లారు. అక్కడ కొండపైకి వెళ్లే మెట్లకు భక్తులు పసుపురాసి, కుంకుమ బొట్లు పెట్టారు. ఒక్కో మెట్టుకు ప్రత్యేకంగా పూజలు జరిపించారు. గోమాతకు పూజలు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, నగరపంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, డీసీసీబీ ఉపాధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ

ఉదయం 10 గంటలకు సీతారామలక్ష్మణుల విగ్రహాల ఊరేగింపుతో గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. సుమారు పదివేల మంది భక్తులు నీలాచలం చుట్టూ ప్రదక్షిణ చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. 11 గంటలకు ఆలయంలోని లక్ష్మీదేవి సన్నిధిలో సీతారామ కల్యాణాన్ని అర్చకులు కనులపండువగా జరిపారు.

ఏర్పాట్లు భేష్

భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో పక్కాగా ఏర్పాట్లుచేశారు. గిరి ప్రదక్షిణ మార్గంలో ఎక్కడికక్కడ తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కళ్యాణ మండపం ప్రాంగణంలో ఐదు వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ పి.నారాయణరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణం, గిరి ప్రదక్షిణ మార్గం, కల్యాణ మండపం, మెట్ల మార్గం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

బాధితులకు న్యాయం

● డీఎస్పీ మోహన్‌రావు

గుర్ల: ఏఆర్ బెనిఫిట్ సంక్రాంతి కానుక బాధితులందరికీ న్యాయం చేస్తామని డీఎస్పీ మోహన్‌రావు అన్నారు. గుర్ల పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం ఆందోళన చేస్తున్న బాధితులతో ఆయన మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బాధితులంతా తప్పనిసరిగా గుర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. మజ్జి అప్పలరాజు కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 25వేల మంది బాధితులు ఉన్నట్లు గుర్తించామన్నారు. బాధితులు ఏజెంట్లపై దాడులు చేస్తున్నారని ఫిర్యాదు వస్తున్నాయని, ఏజెంట్లపై దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోర్టు ద్వారా బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

జాతీయ స్థాయి ట్యాంగ్ సూడో పోటీలకు జిల్లా జట్టు



జాతీయ స్థాయి పోటీలకు పయనమైన జిల్లా జట్టు

కొత్తవలస: ఈ నెల 4వ తేదీ నుంచి ఢిల్లీలోని ఎల్.కె.ఇంటర్నేషనల్ స్టేడియంలో జరగనున్న జాతీయ స్థాయి ట్యాంగ్ సూడో కొరియన్ మార్షల్ ఆర్ట్స్ పోటీలకు జిల్లా జట్టు సోమవారం పయనమైంది. గత ఏడాది సెప్టెంబర్ నెలలో గుంటూరులో జరిగిన స్టేట్ మీట్‌లో ఎం.నికిత, ఎ.తేజస్విని, ఎస్.సౌమ్య, ఎ.సునీతలు జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఉత్తర కోస్తా ట్యాంగ్ సూడో స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ కోచ్ ఎం.ప్రకాశ రావు తెలిపారు.ఈ జట్టుకు మేనేజర్‌గా ఎం.దివ్య వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

ఆర్చరీలో స్వర్ణ పతకం



స్వర్ణపతక విజేత కుమార్‌నాయుడును సన్మానిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట: మండలంలోని డాక్టర్ వరలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థి అంతర్ విశ్వవిద్యాలయాల ఆర్చరీ పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు. తమ విద్యార్థి విజయం పట్ల కళాశాల యాజమాన్యం, బోధనా సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్వర్ణ పతకం సాధించిన విద్యార్థి ఐ.కృష్ణ సాయికిరణ్ కుమార్‌నాయుడును విద్యాసంస్థల యజమానులు డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ సిద్ధి సన్మానించి, రూ.5000లు నగదు ప్రోత్సాహకంగా అందచేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలే లక్ష్యం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలే లక్ష్యంగా మేమంతా కలిసికట్టుగా పనిచేస్తున్నామని జిల్లా ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పి.షణ్ముఖరావు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ప్రజా గ్రంథాలయంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సమసమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. ప్రజా సమస్యలే ప్రధాన అజెండాగా ప్రజా సంఘాల ఐక్యవేదిక పని చేస్తోందన్నారు. కరోనా సమయంలో సంచార జాతుల వారిని వారి గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు జిల్లాలో మూతపడిన పరిశ్రమలు తెరిపించేందుకు కృషి చేశామన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు గొర్లె సూరిబాబు, టీవీ దుర్గారావు, మలిచర్ల దుర్గారావు, చోడి ఆదినారాయణ, గండి బోయిన భాస్కర రావు, కె. విశ్వనాథం, సిరిగిడి పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24క్యా. 10గ్రా.)	54,930–00
బంగారం(22క్యా. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉమ్మడి జిల్లా ప్రజలు వైకుంఠ ద్వార దర్శనం చేసుకునేందుకు ఆలయాలకు పోటెత్తి ఆధ్యాత్మిక వాతావరణంలో గడపగా..మరికొన్ని కుటుంబాల్లో రోడ్డు ప్రమాదాలు తీవ్ర విషాదం నింపాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు, ఇతర ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా మరికొందరు గాయాల పాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన ప్రమాద సంఘటనలపై మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు,. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు...





జోగయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య లేఖామణి, కుటుంబసభ్యులు



ప్రమాద స్థలంలో తుళ్లిపోయి పడి ఉన్న శంకరరావు, సంతోష్‌కుమార్

రామభద్రపురం: మండలకేంద్రంలోని బొబ్బిలి వెళ్లే రహదారిలో గల గ్లోబల్ వ్యూ స్కూల్ వద్ద రెండు బైక్‌లు ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. సోమవారం జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాడంగి మండలం కోడూరు గ్రామానికి చెందిన పాగిరి జోగయ్య(37) స్థానిక గ్లోబల్ వ్యూ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నాడు. రోజూలాగానే స్కూల్‌కు సోమవారం ఉదయం హాజరైన ఆయన ఇంటి తాళాలు, డబ్బులు తన వద్ద ఉండిపోవడంతో స్కూల్ నుంచి మళ్లీ ఇంటికి వెళ్లాడు. భార్య చేతికి వాటిని ఇచ్చి ద్విచక్రవాహనంపై తిరిగి స్కూల్‌కు వస్తుండగా దత్తిరాజేరు మండలం వంగర గ్రామానికి చెందిన బోర్ల సంతోష్‌కుమార్, మరడ శంకరరావులు రాయగడ నుంచి ద్విచక్రవాహనం (బుల్లెట్)పై వస్తూ జోగయ్య వాహనాన్ని బలంగా ఢీ కొట్టారు. దీంతో జోగయ్యతో పాటు వారిద్దరూ రోడ్డుపై తుళ్లి పడిపోయారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్సై సురేంద్రనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జోగయ్యను తన పోలీసు జీపులో బాడంగి సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. స్వల్ప గాయాలైన శంకరరావు, సంతోష్‌కుమార్‌లను ఆటోలో రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించారు. తీవ్రంగా గాయపడిన జోగయ్య బాడంగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య లేఖామణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య గజరాయుని వలస సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిస్తోంది. తనకు తాళాలు ఇచ్చి వెళ్లిన క్షణంలోనే అనంతలోకాలకు వెళ్లిపోయిన భర్త మృతదేహాన్ని చూసి ఆమె భోరున విలపించింది. ఎస్సై సురేంద్రనాయుడు ప్రమాద ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ..



లారీ టైర్లలో ఇరుక్కుపోయిన గౌరమ్మ మృతదేహం

పార్వతీపురం: పట్టణంలోని పాత బస్‌స్టాండ్ సమీపంలో సోమవారం ఛత్తీస్‌గఢ్ వెళ్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పట్టణానికి చెందిన గౌరమ్మ(52)ను బలంగా ఢీకొట్టడంతో టైర్ల కింద ఆమె ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయింది. ఈ మేరకు మృతురాలి మేనల్లుడు ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణమూర్తి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి డ్రైవర్‌ను, లారీని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

క్వారీ ప్రమాదంలో వ్యక్తి..

భోగాపురం: మండలంలోని రామచంద్రపేట గ్రామం సమీపంలో ఉన్న క్వారీలో సోమవారం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయాలతో బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. రామచంద్రపేట క్వారీలో రెండు రోజుల క్రితం ఏర్పాటు చేసిన బాంబు అనుకోకుండా పేలడంతో గ్రామానికి చెందిన కొయ్య గోవింద్(30) క్వారీలో డ్రిల్లింగ్ పనులు చేస్తూ అక్కడికక్కడే మృతిచెందగా, అదే గ్రామానికి చెందిన కోటపల్లి బుల్లోడు తీవ్ర గాయాలతో బయటపడ్డాడు. గాయాలతో ఉన్న వ్యక్తిని విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి బంగారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు..



మృతిచెందిన ఒడిశా యువకుడు సబిజాతర్ నాయక్

కొమరాడ: మండలంలోని గుణానుపురం గ్రామంలో ఇటుకలు తయరీ చేస్తున్న బట్టీ వద్ద సోమవారం ఒడిశా రాష్ట్రానికి చెందిన యుమకుడు సబిజాతర్ నాయక్(19) మృతి చెందాడు. స్థానికులు, ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని గుణుపూర్ సమితి ఉక్రంబ్ గ్రామానికి చెందిన యువకుడు ఇటుక తయారీ పని కోసం వచ్చి మట్టిని ట్రాక్టర్‌తో తొక్కిస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై ఎస్సై జగదీష్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టు నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు..

లారీ, బైక్ ఢీకొని మరొకరు..



రాజేష్‌కుమార్ (ఫైల్)

మెరకముడిదాం: మండలంలోని గర్భాం ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్ ఎదురుగా లారీ, బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. వివరాలిలా వున్నాయి. మెరకముడిదాం గ్రామానికి చెందిన మురహరిరావు రాజేష్‌కుమార్ (32) మెరకముడిదాం నుంచి గరివిడి బైక్‌పై వెళ్తుండగా గర్భాం ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్ దగ్గర మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో రాజేష్‌కుమార్ తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాజేష్ బంధువులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజేష్ తండ్రి ఏడాది క్రితం కరోనాతో మృతిచెందారు. ఇప్పుడు రాజేష్ ఇలా మృతిచెందడంతో కుటుంబసభ్యులు, బంధువులు భోరున విలపించారు. విషయం తెలుసుకున్న బుదరాయవలస ఎస్సై సీహెచ్.నవీన్‌పడాల్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీపురుపల్లి సీహెచ్‌సీకి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

జీపు బోల్తాపడి ఇద్దరు గిరిజనులు..



మృతి చెందిన హరికృష్ణ



సంఘటన స్థలంలో చంద్రమ్మ మృతదేహం

కొమరాడ: మండలంలోని సరుగుడు గూడ–జాకురు గ్రామాల మధ్య ఘాట్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గిరిజనులు మృతిచెందారు. సోమవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని గుడ్డాం గ్రామం నుంచి పార్వతీపురం జిల్లా కేంద్రానికి జొన్న గింజలు, ధాన్యంతో బయల్దేరిన జీపులో ప్రయాణికులు హిమరిక హరి కృష్ణ (29) భార్య జయశ్రీ, ఇద్దరు పిల్లలు, కోలక చంద్రమ్మ (62) ఉన్నారు. అయితే అకస్మాత్తుగా అదుపుతప్పి జీపు బోల్తా పడడంతో సంఘటనా స్థలంలోనే చంద్రమ్మ మృతి చెందగా గాయాల పాలైన హరికృష్ణను పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై జగదీష్‌నాయుడు సంఘటన స్థలంలో పరిశీలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్ స్పందనకు 106 వినతులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం ఫోర్ట్: కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి 106 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 69 వినతులు ఉన్నాయి. మిగిలిన వాటిలో డీఆర్‌డీఏ 13, హౌసింగ్ 6, మున్సిపల్‌శాఖ 6, వైద్యశాఖ 5, పంచాయతీరాజ్ 7 వినతులు అందాయి. వాటిలో ఫించన్లు, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై వినతులు ఉన్నాయి.

డీడీఓ నియామకం ఎంపీడీఓ నిర్ణయమే

స్పందన అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇకపై ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్ నియంత్రణలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. శాఖల మధ్య సమన్వయం కొరవడకుండా ఉండేందుకు సచివాలయ సిబ్బందిని హెచ్‌ఓడీలు నియంత్రించాలని స్పష్టం చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, వీఆర్వోలు, సర్వేయర్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఓడీలు వేస్తే కాపీని తప్పనిసరిగా సీపీఓకు మార్క్ చేయాలని స్పష్టం చేశారు. ఎవరిని డీడీఓగా నియమించాలనేది ఎంపీడీఓలు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు త్వరలో సర్క్యులర్ వస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మావతి, సూర్యనారాయణలు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సరైన పరిష్కారం చూపాలి

పార్వతీపురం: స్పందన కార్యక్రమంలో ప్రజలు పెట్టుకునే అర్జీలకు వారు సంతృప్తి చెందే విధంగా సరైన పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావులతో కలిసి స్పందన కార్యక్రమంలో ప్రజలనుంచి 120 అర్జీలు స్వీకరించారు.

అర్జీలలో కొన్ని..

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో మంజూరైన గృహాలు నిర్మించిన వారికి ఇంటి నిర్మాణ బిల్లులు మంజూరు చేయాలని కొమరాడ మండలం మార్కొండపుట్టి గ్రామానికి చెందిన జి. త్రినాథ, తదితరులు దరఖాస్తు చేసుకున్నారు.

- కురుపాం మండలం లక్ష్మీపురం గ్రామంలో ఇల్లు నిర్మించుకోవడానికి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని ఐ.గౌరీశంకర్, తదితరులు కోరారు.
- తమ గ్రామానికి సమీపంలో సుమారు 100 మీటర్ల కంటే తక్కువ దూరంలో, ప్రధాన రహదారిని ఆనుకుని చెత్త సేకరణ కేంద్రం పెట్టడం వల్ల ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు. కావున చెత్త సేకరణ కేంద్రాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని గరుగుబిల్లి మండలం కొంకడివరం గ్రామస్తుడు ఎ.అప్పలనాయుడు కోరారు.
- తన భర్త ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా రెండు నెలలుగా మండల ఎడ్యుకేషన్ అధికారి జీతభత్యాలు నిలిపివేశారు. దీంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, వెంటనే జీతభత్యాలు అందజేయాలని పార్వతీపురం పట్టణానికి చెందిన దామినేని గాయత్రి విన్నవించింది.

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక స్పందన

విభిన్న ప్రతిభావంతులకు కలెక్టర్ కార్యాలయంలోని సెల్లార్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓ జె. వెంకట్రావు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖాధికారి బి.జగన్నాథరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, పీఆర్ ఈఈ ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకర రావు, గృహ నిర్మాణసంస్థ పీడీ పి.రఘురాం, డీఈఓ ఎస్‌డీవీ రమణ, డ్వామా పీడీ కె. రామ చంద్రరావు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పార్వతీపురం: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

ఘనంగా పెద పోలమాంబ తొలేళ్ల ఉత్సవం



తొలేళ్ల ఉత్సవానికి సిద్ధమైన పెద్ద అమ్మవారి ఘటాలు



అమ్మవారి ఘటంతో తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం



పెద్ద పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మేనత్త పెదపోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో రాధాకృష్ణ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, కమిటీసభ్యులు, రెవిన్యూ యుడు, కర్ణాలు, కుప్పిలి, పూజారి, పూడి వారి కుటుంబసభ్యులు, గ్రామపెద్దలు తొలేళ్ల ఉత్సవంలో పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం పెద్ద అమ్మవారి ఘటాలకు అలంకరణ చేసి, పూజ జరిపించి, తిరువీధి ప్రారంభించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో అమ్మవారి ఘటాలకు తిరువీధి జరిపించగా, భక్తులు అమ్మవారి ఘటాలకు పూజలు చేశారు. అనంతరం ప్రధాన రహదారి వద్దనున్న అమ్మవారి గద్దె దగ్గర తొలేళ్ల ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. మంగళవారం ప్రధానపండగ, బుధవారం అనుపోత్సవం నిర్వహిస్తారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు గ్రామం శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్సై ఎస్.ముకుందరావు సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా జూదమాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి దగ్గర రూ. 18,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిలార్క్ ద్వారా గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపై అవగాహన

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి జగన్నాథ రావు



డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథ రావు

పార్వతీపురం టౌన్: కిలార్క్ వాయిస్ ద్వారా గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తామని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బి జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కిలార్క్ వాయిస్ ద్వారా నాలుగు విభాగాల్లో సాంకేతిక ఆరోగ్య సందేశాలను కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వశాఖ అందిస్తుందని తెలిపారు. కిలార్క్ ఐవీఆర్‌ఎస్ (ఇంరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా 72 సందేశాలను అందిస్తుందని అందులో గర్భిణులు, శిశువుల ఆరోగ్యం, ఆస్పత్రి ప్రసవాలపై మొబైల్ ఫోన్ ద్వారా సందేశాలు వినిపిస్తుందని చెప్పారు. కిలార్క్ వాయిస్‌తో అన్నయ్య, వదినమ్మ, నమస్కారం బాగున్నారా? భారత ప్రభుత్వం నుంచి ఫోన్ చేస్తున్నామని వస్తుందని, ఇది ఆరువారాల పాటు 0124458800 నంబర్ నుంచి గర్భిణులు, బాలింతలకు కాల్ చేసి సాంకేతిక ఆరోగ్య సందేశాలను ఇస్తుందని వివరించారు. ఆశ కార్యకర్తలు గర్భిణులకు కిలార్క్‌పై అవగాహన కల్పించాలని సూచించారు.

కళాకారులను ప్రోత్సహించడం అందరి బాధ్యత



కోలాటం కళాకారుల చీరలు పంపిణీ చేసున్తన్న దాతలు

బొబ్బిలి: ఆధ్యాత్మిక కళాకారులను ప్రోత్సహించడం మనందరి బాధ్యతని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని తారకరామా కాలనీలో మహిళా కోలాటం కళాకారులకు స్థానిక ధర్మకర్త రెడ్డి సత్యం ఆధ్వర్యంలో సోమవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు పెద్దాడ సంతోష్ కుమార్, రాజేష్, సాయిప్రసన్న, పలువురు కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయమందించాలి

● ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించాలని విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి ఆయన 20 పిర్యాదులను స్వీకరించి మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీస్ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడి చట్టపరిధిలో బాధితులకు న్యాయమందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐలు రుద్రశేఖర్, జి.రాంబాబు, ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి సాధించే దిశగా కృషి చేద్దాం..



సూచనలిస్తున్న ఎంపీడీఓ అల్లు భాస్కరరావు

బొబ్బిలి రూరల్: మండలంలో ప్రగతి సాధించే దిశగా అందరం కృషి చేద్దామని ఎంపీడీఓ అల్లు భాస్కరరావు మండల స్థాయి అధికారులు, పంచాయతీ, సచివాలయ సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో నూతన సంవత్సర సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కొత్త ఏడాదిలో మండల ప్రగతికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, పంచాయతీలలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పరిష్కరించాల్సిన సమస్యలను వివరించారు. సమావేశంలో ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.